ప్రజాశక్తి

శనివారం 11 మే 2024

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

నేటితో ప్రచారానికి తెర

- అన్నిచోట్లా ప్రలోభాల ఎర
- ఓటర్లను మభ్యపెట్టే పనిలో ప్రధాన పార్టీలు
- సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై అధికారుల ప్రత్యేక నిఘా
- ప్రశాంత పోలింగ్‌కు ఏర్పాట్లు

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

సార్వత్రిక ఎన్నికల ప్రచార గడువు శనివారం సాయంత్రం ఆరు గంటలతో ముగియనుంది. సోమవారం జరగనున్న ఎన్నికలకు ప్రధాన పార్టీలు ఓటర్లను ప్రలోభపెట్టే పనిలో పడ్డాయి. ఎన్ని నియంత్రణ వ్యవస్థలున్నా, ఓటర్లను ఆకట్టుకొనే అనైతిక పనులు ఆగడంలేదు. డబ్బు, మద్యం పంపిణీ యథేచ్ఛగా సాగుతోంది. ఆదరణలేని చోట ఓటర్లను ఆకట్టుకొనేందుకు మరింత ఖర్చు ఎక్కువ చేస్తున్నారు. బలహీనులకు డబ్బు ఎరచూపి తమవైపు తిప్పుకొనే ప్రయత్నాలను అభ్యర్థులు ముమ్మరం చేశారు. నిష్పాక్షికంగా ఎన్నిక జరిగేందుకు, ఓటర్లపై ఎటువంటి ప్రభావమూ పడకుండా వుండేందుకు 48 గంటల ముందు ఎన్నికల కమిషన్ సైలెన్స్ పీరియడ్‌ను అమలు చేస్తోంది. ఇది శనివారం సాయంత్రం 6 గంటలకు ప్రారంభమై 14తో ముగుస్తుంది. 13న జరగనున్న పోలింగ్ ప్రక్రియ శాంతియుతంగా జరిగేలా సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పరిధిలో ప్రత్యేక భద్రతా సిబ్బంది, సెక్టార్ అధికారులు ప్రత్యేక నిఘా పెంచారు. ఎన్నికల నిబంధనల ఉల్లంఘన జరిగినట్లు విచారణలో తేలితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోనున్నారు.

ఇవీ నిబంధనలు

ప్రజా ప్రాతినిధ్య చట్టం 1951 సెక్షన్ 126 ప్రకారం.. ఎన్నికలకు 48 గంటల ముందు అభ్యర్థులు ప్రచారంతో పాటు ఎలక్ట్రానిక్, సోషల్ మీడియా ప్రచారాలు నిలిపివేయాలి. సైలెంట్ పీరియడ్‌లో బహిరంగ సభలు, ర్యాలీలు, ఊరేగింపులు, ఎలక్ట్రానిక్ మీడియా ప్రచారాలకు అనుమతి లేదు. సోషల్ మీడియా మాధ్యమాల్లో నిబంధనల ఉల్లంఘనపై ప్రత్యేక నిఘా ఉంటుంది. సిఆర్‌పిసి 144 సెక్షన్

మిగతా 2లో..

దీక్షల్లో కూర్చున్న స్టీల్‌ప్లాంట్ కార్మికులు

స్టీల్‌ప్లాంట్ పరిరక్షకులకే మద్దతు

విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ

వార్త మెయిన్‌లో..

ఘనంగా జాతీయ సాంకేతిక దినోత్సవం

▶ వార్త 8లో..

పోర్టు కాలుష్య సమస్య పరిష్కారానికి కృషి

▶ వార్త 8లో..

చందనోత్సవం.. విజయవంతం

- భక్తులకు పటిష్ట ఏర్పాట్లు చేసిన అధికారులు
- ఎన్నికల కోడ్ అమల్లో ఉండటంతో తగ్గిన 'పొలిటికల్' రద్దీ

క్యూలైన్లలో బారులుతీరిన భక్తులు

ప్రజాశక్తి - సింహాచలం : సింహాద్రి అప్పన్న ఆలయంలో జరిగే అతిపెద్ద ఉత్సవమైన చందనోత్సవం విజయవంతమైంది. దేవస్థానం అధికారులు ఉత్సవాన్ని రెవెన్యూ, పోలీసు శాఖ అధికారులతో సమన్వయం చేసుకుని ఎటువంటి అవాంఛనీయ సంఘటనలూ జరగకుండా పూర్తి చేశారు. శుక్రవారం ఉదయం సుప్రభాత సేవతో అప్పన్న స్వామిని మేల్కొలిపారు. సేవా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం స్వామిపై ఉన్న చందనాన్ని తొలిచి ప్రత్యేక పూజలు చేపట్టారు. స్వామి వారి తొలి దర్శనాన్ని ఆలయ అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్ గజపతి రాజు దంపతులకు కల్పించారు. ఈ ఏడాది చందనోత్సవంలో సామాన్య భక్తులకు అధికారులు పెద్దపీట వేశారు. శుక్రవారం వాతావరణం చల్లబడడంతో భక్తులు భారీగానే తరలివచ్చారు. ఆహ్లాదకర

మిగతా 2లో..

అప్పన్నకు పట్టువస్త్రాలు అందజేస్తున్న అశోక్‌గజపతి దంపతులు

జై భారత్ పార్టీ

విశాఖ ఉత్తర (NORTH) నియోజకవర్గ శాసన సభ (MLA) అభ్యర్థి

మన గుర్తు

బ్యాటరీ టార్చ్

V.V (JD) Lakshmi Narayana IPS(Rtd)

వి.వి (జెడి) లక్ష్మీనారాయణ

అధ్యక్షులు, జై భారత్ నేషనల్ పార్టీ .

బ్యాలెట్ నమూన - (ఇ.వి.ఎమ్)

వరుస నెం	అభ్యర్థి పేరు	ఫోటో	గుర్తు	Ballot Unit
1				
2				
3				
4				
5				
6				
7				
8	లక్ష్మీనారాయణ వి.వి (జెడి లక్ష్మీనారాయణ)			
9				
10				

వరుస నెం. 8, బ్యాటరీ టార్చ్ గుర్తు పై మీ అమూల్యమైన ఓటు వేసి వి.వి (జెడి) లక్ష్మీనారాయణ గారిని అఖండ మెజారిటీతో గెలిపించ ప్రార్థన

ఉత్తర విశాఖ - ఉత్తమ విశాఖ

పోలింగ్ తేది - 13 మే 2024

More Details Call : 9849667967, 7631331379, 9110383594

మొదటి పేజీ తరువాయి..

నేటితో ప్రచారానికి తెర

ప్రకారం ఒకచోట ఐదుగురి కంటే ఎక్కువ మంది గుమిగూడకూడదు. పోలింగ్ ముగిసే సమయానికి 48 గంటల వ్యవధిలో లౌడ్ స్పీకర్లు ఉపయోగించరాదు.. బహిరంగ ప్రచారాలు చేయకూడదు. నియోజకవర్గానికి చెందని ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన రాజకీయ పార్టీల కార్యకర్తలు, ప్రచార కార్యకర్తలు, ఓటర్లు కానివారు తమ సొంత ప్రాంతానికి వెళ్లిపోవాలి. సైలెన్స్ పీరియడ్‌లో రాజకీయ ఆవేశపూరిత ప్రసారాలు చేయరాదు.

ఓటు సహాయక బృందాలు

పోలింగ్ బూత్‌కు వెళ్లడానికి అవసరమైన వారికి సహాయపడేందుకు ఓటరు సహాయక బృందాలను ఇప్పటికే ఏర్పాటుచేశారు. వృద్ధులు, వికలాంగ ఓటర్లకు సహాయం అందించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ప్రతి పోలింగ్ స్టేషన్‌లో ర్యాంప్, వీల్‌ఛైర్ సౌకర్యం కల్పించారు. శాంతిభద్రతల పరిరక్షణ, ప్రశాంత పోలింగ్ నిర్వహణకు జిల్లా వ్యాపితంగా పటిష్ట భద్రతా చర్యలు అమల్లో వున్నాయి. సెన్సిటివ్ పోలింగ్ స్టేషన్లలో అదనపు పోలీసు సిబ్బందిని ఏర్పాటుచేశారు.

మీడియాకు సూచనలు

పోలింగ్ సరళిని పరిశీలించేందుకు ఎన్నికల కమిషన్ జారీచేసిన మీడియా పాసులు పొందిన అక్రిడేటెడ్ జర్నలిస్టులకు అనుమతి వుంది. ఓటింగ్ కంపార్ట్మెంట్ వద్ద వీడియోలు, ఫొటోలు తీయకూడదు. పోలింగ్ కేంద్రం ఆవరణ, క్యూలైన్లను వీడియో, ఫొటోలు తీసుకోవచ్చుగానీ ఎన్నికల సరళిపై చర్చించకూడదు. అభ్యర్థులు తమ ఓటు వినియోగించుకొని 100 మీటర్లు దాటి వెళ్లాక మాత్రమే మీడియాతో మాట్లాడాలి. పోలింగ్ ముగిసేవరకు బూత్‌ల వద్ద బయట ఓటర్లను ప్రభావితం చేసేలా ప్రచారం చేయరాదు. ఒక పార్టీకి సంబంధించిగానీ, అభ్యర్థిపైగానీ ఎలాంటి బాధ్యతారహిత విమర్శలు, వ్యాఖ్యలు, ఫలితాలు, అంచనాలు చేయరాదు. వంద మీటర్లు దాటిన తరువాతనే అభ్యర్థులు ఓటర్లతో ఓటింగ్ సరళిపై మాట్లాడాలి.

చందనోత్సవం.. విజయవంతం

వాతావరణం నడుమ నృసింహస్వామిని దర్శించుకున్నారు. సుదీర్ఘ క్యూలైన్లు ఉండటంతో కొందరు భక్తులు ఇబ్బంది పడటం కనిపించింది. భక్తులకు క్యూ లైన్లలో మంచినీటి సదుపాయం కల్పించారు. మజ్జిగ, శీతల పానీయాలను స్వచ్ఛంద సేవా సంస్థల వారు అందించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు టికెట్ లేకుండా ఏ ఒక్కరినీ దర్శనానికి అనుమతించకపోవడంతో ప్రతి భక్తునికీ సామి దర్శనం సాఫీగా సాగింది. సాయంత్రం భక్తుల రద్దీ దృష్ట్యా రూ.300, రూ.1000, రూ.1500 క్యూలైన్లలో భక్తులను పంపించి రద్దీని నియంత్రించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యమూ కలగకుండా గట్టి పోలీస్ భద్రత కల్పించారు. వాహనాలను కొండపైకి అనుమతించలేదు. ఎన్నికల కోడ్ అమల్లో ఉండటంతో రాజకీయ నాయకులకు, అధికారులకు ప్రొటోకాల్ వర్తించలేదు. స్వామివారిని శారదా పీఠాధిపతి స్వరూపానంద సరస్వతి, ఆయన శిష్యులు, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, దేవాదాయ శాఖ చీఫ్ సెక్రటరీ, కమిషనర్ ఎస్‌డిసి రామచంద్ర మోహన్, పోలీస్ కమిషనర్ రవిశంకర్ అయ్యర్, జివిఎంసి కమిషనర్ సాయికాంత్ వర్మ, వివిధ విభాగాల అధికారులు, విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు దర్శించుకున్నారు.

రంగసాయి మీడియా తొలి సినీ వెబ్ పత్రిక ఆవిష్కరణ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : నేటి చలనచిత్ర పరిశ్రమ వార్తా విశేషాలను క్షణాల్లో అభిమానులకు అందించడానికి నూతనంగా రంగసాయి మీడియా ఏర్పాటైంది. బాదంగీర్ సాయి నేతృత్వంలో ప్రారంభమైన ఈ రంగసాయి మీడియా తొలి సినీ వెబ్ పత్రికను శుక్రవారం సాయంత్రం రైటర్స్ అకాడమీ అధినేత, లీడర్ దినపత్రిక సంపాదకులు వివి.రమణమూర్తి విడుదల చేశారు. విశాఖపట్నం రంగసాయి నాటక గ్రంథాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఇంతవరకు నాటక రంగంలో మంచి పేరు తెచ్చుకున్న బాదంగీర్ సాయి ఈ రంగసాయి మీడియా ద్వారా సినీ జర్నలిజంలో ప్రవేశించి సినీ వెబ్ పత్రిక తీసుకురావడం ఎంతో ఆనందదాయకమని అన్నారు. సీనియర్ జర్నలిస్టు నాగబోయిన నాగేశ్వరరావు, వినోద్, నవరస మూర్తి, హేమ, ఆకిరి సురేష్ పాల్గొన్నారు.

టిడిపిలోకి పుక్కళ్ల ధనలక్ష్మి, శంకర్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ తూర్పులో వైసిపికి షాక్ తగిలింది. నియోజకవర్గంలోని 18వ వార్డు ఇన్‌చార్జి పుక్కళ్ల ధనలక్ష్మి, శంకర్ శుక్రవారం తెలుగుదేశం పార్టీలో చేరారు. తూర్పు శాసనసభ్యులు వెలగపూడి రామకృష్ణ బాబు ఆ దంపతులకు టిడిపి కండువా వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా పుక్కళ్ల ధనలక్ష్మి, శంకర్ మీడియాతో మాట్లాడుతూ పేదలకు సేవ చేయడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు.

ప్రజలను దోచుకున్న జగన్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : 360 సార్లు బటన్ నొక్కి లబ్ధిదారులకు డబ్బు పంపిణీ చేశానని చెబుతున్న ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి రూపాయి ఇచ్చి వంద రూపాయలు ప్రజల నుంచి లాక్కున్నారని మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ ఆరోపించారు. ఎంఆర్‌పిఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

IN THE HONOURABLE COURT OF THE JUNIOR CIVIL JUDGE AT PONDURU
OS.91/2023

Between:
లచ్చుబుగత ఇందిర ...పిర్యాది/పిటిషనర్
And:
కిల్లంపల్లి క్రాంతికిరణ్, ...రెస్పాండెంట్
To,
కిల్లంపల్లి క్రాంతికిరణ్, S/o బాస్కర్, Door No- 36-49-11, గవర కంచరపాలెం, కంచరపాలెం, విశాఖపట్నం.

పై నెంబర్ గల పిటిషనర్‌కు మీరు బకాయి పడినారు అని Civil procedure Code-26 ప్రకారం పై నెంబరు గల పిర్యాది/పిటిషనర్ మీపై సివిల్, దావా దాఖాలు చేసి యున్నారు. అందుకు మీకు ఆక్షేపణలు/అభ్యంతరాలు ఉన్న యెడల **తేదీ 17-05-2024 దీన. ఉదయం 10:30 ని॥లకు** మీరు స్వయంగా గాని వాకీలు ద్వారా గాని హాజరై మీకు గల అభ్యంతరాలు/ఆక్షేపణలు తెలియజేసుకోగలరని, లేనియెడల మీపరోక్షమందు తీర్మానించడం జరుగునని (Exparty Decree) తెలియజేయడం అయినది.

// By court order //

జి. శ్రీ క్రిష్ణప్రసాద్,
న్యాయవాది,
పొందూరు.

పొందూరు,
తేది: 11-05-2024.

ప్రశాంత ఎన్నికలకు సహకరించండి

మాట్లాడుతున్న విశాఖ కలెక్టర్ మల్లికార్జున

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం శనివారం సాయంత్రం 6 గంటల నుంచి ప్రచారం నిలుపుదల చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున అభ్యర్థులకు సూచించారు. ప్రతి ఒక్కరూ తప్పకుండా ఎన్నికల ప్రవర్తనా నియమావళికి లోబడి వ్యవహరించాలని పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. పోలింగ్ ముగియడానికి 48 గంటల ముందు నుంచే సైలెంట్ పిరియడ్ అమల్లోకి వస్తుందని, ఆ సమయంలో లౌడ్ స్పీకర్లు ఉపయోగించి ఎలాంటి రాజకీయ ప్రచారాలూ చేయడానికి వీలులేదని స్పష్టం చేశారు. 144 సెక్షన్ అమల్లో ఉంటుంది గనుక నలుగురు కంటే ఎక్కువ మంది తిరగడానికి వీలుండదని గుర్తు చేశారు. దీన్ని పరిగణనలోకి తీసుకొని పోటీ చేయు అభ్యర్థులు జాగ్రత్తలు వహించాలని సూచించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో పోటీ చేయు అభ్యర్థులతో శుక్రవారం సాయంత్రం కలెక్టర్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. చివరి 72 గంటల్లో పోలింగ్ పరమైన ఏర్పాట్లు, సైలెంట్ పిరియడ్లో అనుసరించాల్సిన విధానాలపై సూచనలు చేశారు. పోలింగ్ ముగియడానికి 48 గంటలలోపు సంబంధిత నియోజకవర్గంలో బయట వ్యక్తులు ఉండడానికి వీలులేదని స్పష్టం చేశారు. 72 గంటల కాలంలో పోలీసు బృందాలు, ఎంసిసి బృందాలు పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో ఉన్న లాడ్జిలు, హోటళ్లు, కల్యాణ మండపాలు, ఫంక్షన్ హాళ్లలో తనిఖీ చేస్తాయని గుర్తు చేశారు. అనుమానిత వ్యక్తులు, బయట వ్యక్తులు ఉంటే ఎంసిసి నిబంధనలను అనుసరించి చర్యలు తీసుకుంటారని అభ్యర్థులకు తెలియజేశారు. రాజకీయ పరమైన బోర్డులు, పోస్టర్లు తొలగించాల్సి ఉంటుందని చెప్పారు. పోలింగ్ ఏజెంట్ల వివరాలను నిర్ణీత సమయంలోగా పిఒకు అందజేయాలని అభ్యర్థులకు సూచించారు. ఒపీనియన్ పోల్స్ కండక్టు చేయడానికి వీలులేదని స్పష్టం చేశారు. ఈ నెల 13న ఆర్జిత సెలవు ఉంటుందని, ప్రభుత్వ, ప్రయివేటు రంగాల్లో పని చేసే ఉద్యోగులు, కార్మికులు ఆ రోజు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి సూచించారు. ఆయా రంగాలు ఈ విషయాన్ని గమనించి ఉద్యోగులకు, కార్మికులకు అనుమతి ఇవ్వాలని చెప్పారు.

ఈ నెల 12, 13వ తేదీల్లో పత్రికల్లో ప్రచురించాలి అనుకునే ప్రకటనలకు జిల్లా ఎంసిఎంసి నుంచి తప్పనిసరిగా ముందస్తు అనుమతి తీసుకోవాలని, లేనిపక్షంలో ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పార్లమెంటు నియోజకవర్గ సాధారణ పరిశీలకులు అమిత్ శర్మ మాట్లాడుతూ 13న పండగ వాతావరణంలో ఎన్నికల ప్రక్రియ జరగడానికి అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్ కుమార్, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

FORMAT C-1
(for Candidate to Publish in Newspapers, TV)
DECLARATION ABOUT CRIMINAL CASES
(As per the Judgement Dated 25th September Court in WP (Civil) No. 536 of 2011 (Public Interest & Ors. Vs. Union of India)

Name and address of Candidate : **MARADANA JAGGUNAUDU**
S/o.**LATE JAGANNADHAM**
aged 58 years, resident of. D.NO. 71-31-634/1, GANDHIGRAM, VISAKHAPATNAM-530005,
Name of the Political Party : **COMMUNIST PARTY OF INDIA (MARXIST) CPI(M)**
Name of Election : **Andhra Pradesh Legislative Assembly**
Name of Constituency : **25 Gajuwaka**

I MARADANA JAGGUNAUDU S/o.**LATE JAGANNADHAM** aged 58 years, resident of. D.NO. 71-31-634/1, GANDHIGRAM, VISAKHAPATNAM-530005, a candidate for the above mentioned election, declare for public information the following details about my Criminal antecedents:

Sl. No	Pending Criminal Cases			Details about cases of Conviction for criminal offences	
	Name of Court	Case No and status of case	Section(s) of Acts concerned and brief description of offence(s)	Nameof Court & date (s) of order(s)	Description of offence(s) & punishment imposed
1.	**VIII AMMCOURT GAJUWAKA**	**FIR No. Cr.No.285/2014 of Gajuwaka Police Station, and case no. 74/2017 of VIII AMM Court Gajuwaka**	**U/S353,188, RW 34 IPC Protest Dharna**	Not Applicable	Not Applicable
2.	**II ACMM VSP**	**FIR No. Cr. No.19/2018 of Maharanipeta Police Station, VSP and CC 2542/2020 II ACMM vsp,**	**U/S143,188/341, 336 RW 34 IPC Protest Dharna**	Not Applicable	Not Applicable
3.	**Pending Investigation**	**FIR No. Cr. No.118/2023 of MVP Police Station, VSP**	**U/S142,341,353 IPC Protest Dharna**	Not Applicable	Not Applicable

**In the case of election to Council of States or Election to Legislative Council by MLAs mention the Election Concerned in place of Name of Constituency.*

MARADANA JAGGUNAUDU, S/o.**LATE JAGANNADHAM**
25 Gajuwaka Legislative Assembly Constituency Candidate

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి-వేపగుంట : చీమలాపల్లి సబ్‌స్టేషన్, వేపగుంట ఫీడర్ పరిధిలో నిర్వహణ, చెట్లు నరికివేత పనుల నిమిత్తం శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు జోన్-3 ఇఇ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. చీమలాపల్లి, పొర్లుపాలెం, శేషాద్రినగర్, వేపగుంట, గంగిరెడ్ల కాలనీ, జివిఎంసి జోనల్ ఆఫీస్ తదితర ప్రాంతాలకు శనివారం ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

టిడిపిలో చేరికలు

ప్రజాశక్తి -యంత్రాంగం

ఆనందపురం: ఆనందపురం మండలం తర్లువాడ పంచాయతీ వైసిపి సర్పంచ్ బిఆర్‌బి.నాయుడు భీమిలి కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గంటా శ్రీనివాసరావు ఆధ్వర్యాన చంద్రబాబు సమక్షంలో అనుచరులతో కలిసి తెలుగుదేశం తీర్థం పుచ్చుకున్నారు. వారికి పసుపు కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. తెలుగుదేశం పార్టీ గెలుపునకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి ఇన్చార్జ్ కోరాడ రాజబాబు, భీమిలి జడ్‌పిటిసి గాడు వెంకటప్పుడు తదితరులు పాల్గొన్నారు.

భీమునిపట్నం : మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ కొప్పల ప్రభావతి, రమేష్ దంపతులు గురువారం చంద్రబాబు సమక్షంలో టిడిపిలో చేరారు. వీరితో పాటు మాజీ కౌన్సిలర్ అర్జి శంకరరావు, తెడ్లాపు వెంకటరమణమూర్తి, రాజేష్ తది తరులు వైసిపి నుంచి టిడిపిలోకి గంటా శ్రీనివాసరావు ఆధ్వర్యాన చేరారు. వీరందరికీ కండువా వేసి పార్టీ లోకి ఆహ్వానించారు. డిఎల్‌డిఎ చైర్మన్ గాడు వెంకటప్పడు, పార్టీ నియోజక వర్గ ఇంఛార్జి కోరాడ రాజబాబు తదితరులు పాల్గొన్నారు

మాదిగల ఆత్మీయ సమావేశం

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలం వేములవలస ఎస్‌సి కాలనీలో ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్చార్జ్ చిత్రపు శ్రీనివాసరావు అధ్యక్షతన మాదిగల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మాదిగలు ఐక్యతగా పనిచేయాలన్నారు. ఆనందపురం, పద్మనాభం, భీమిలి మాదిగలు ఎన్‌డిఎ కూటమి అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వేములవలస సర్పంచ్ లంక కొండమ్మ, రాచర్ల వెంకట్రావు, ముకుందరావు, కణితి అప్పలనారాయణ, లంక పైడిరాజు, కొమ్ము శంకర్రావు, బోర రామకృష్ణ, విజయలక్ష్మి, కణితి రాము, లంక గణేష్, కొమ్ము అప్పలరాజు, కడమెట్ల విజయలక్ష్మి, లంక లక్ష్మి పాల్గొన్నారు

731కి చేరిన పోస్టల్ బ్యాలెట్ పోలింగ్

ప్రజాశక్తి- భీమునిపట్నం : స్థానిక ప్రభుత్వ డైట్‌లో నాలుగు రోజులుగా జరుగుతున్న పోస్టల్ బ్యాలెట్ పోలింగ్‌లో శుక్రవారం ఆరుగురు ఉద్యోగులు ఓటు వేశారు. వీరితో కలిపి ఇప్పటి వరకు 731 మంది ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. డైట్‌లో ఏర్పాటుచేసిన 5 పోలింగ్ కేంద్రాల పరిధిలో మొత్తంగా 1174 మంది ఉద్యోగులు ఓటు హక్కును వినియోగించు కోవాల్సి ఉంది.

చంద్రబాబును కలిసిన దాడి సత్యనారాయణ

ప్రజాశక్తి- ములగాడ : ఎన్నికల ప్రచారంలో భాగంగా విశాఖపట్నంలో పర్యటిస్తున్న మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబును మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ, ఉపకార్ చారిటబుల్ ట్రస్టు అధ్యక్షులు కంచర్ల అచ్యుతరావు వారి అనుచరులతో వెళ్లి కలిశారు. శాలువాతో సత్కరించారు. ఈ ఎన్నికలలో టిడిపి విజయానికి కృషిచేస్తామని దాడి సత్యనారాయణ, కంచెర్ల అచ్యుతరావు చెప్పారు. రాష్ట్ర అభివృద్ధి కోసం కూటమి అభ్యర్థులను గెలిపించాలని చంద్రబాబు కోరారు.

ఓటింగ్ శాతం ఎక్కువ ఉండేలా చూడాలి

ముత్తంశెట్టి శ్రీనివాసరావు

సమావేశంలో మాట్లాడుతున్న ముత్తంశెట్టి శ్రీనివాసరావు

ప్రజాశక్తి -ఆనందపురం: భీమిలి నియోజకవర్గంలో ఓటింగ్ శాతం ఎక్కువ నమోదయ్యేలా చూడాలని బూత్ ఏజెంట్లకు వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు సూచించారు. ఆనందపురం మండల వైసిపి కార్యాలయంలో శుక్రవారం బూత్ ఏజెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం చేసిన సంక్షేమం, అభివృద్ధి ప్రతి ఓటరుకూ తెలిసేలా వివరించాలని నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. మరో 48 గంటలు అందరూ కష్టపడి పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ ప్రెసిడెంట్ బంక సత్యం, వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, జడ్‌పిటిసి సభ్యులు కోరాడ వెంకటరావు, వైస్ ఎంపిపిలు పాంద్రంకి శ్రీను, రామకృష్ణ, పాంద్రంకి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

వైసిపిలో పలువురు చేరిక

వెల్లంకి పంచాయతీ నుంచి కాంగ్రెస్ నాయకుడు పడాల రాము సుమారు 50 మంది అనుచరులతో కలిసి శుక్రవారం ముత్తంశెట్టి శ్రీనివాసరావు సమక్షంలో వైసిపిలో చేరారు.

కెకె.రాజుకు పలు సంఘాల మద్దతు

ముస్లిం పెద్దలను కలిసి ఓట్లు అభ్యర్థిస్తున్న కెకె.రాజు

ప్రజాశక్తి-సీతమ్మధార : ఉత్తర నియోజకవర్గం వైసిపి ఎమ్మెల్యేగా పోటీచేస్తున్న కెకె.రాజుకు పలు సంఘాలు మద్దతు తెలిపాయి. విశాఖ మారుతి, నాయీ బ్రాహ్మణ, నాదస్వర, డోలు కళాకారుల సంఘం సభ్యులు, విశాఖ జిల్లా సీరత్ కమిటీ సభ్యులు కెకె.రాజును కలిసి మద్దతు తెలిపారు.

జివిఎంసి 26వ వార్డు సీనియర్ నాయకులు పాండవ శ్రీనివాసరావు, పాండవ ఈశ్వరరావు ఆధ్వర్యాన జనసేన యూత్ వైసిపిలో చేరారు. వీరికి కెకె రాజు కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

జివిఎంసి 51వ వార్డు పరిధి మాధవధార లాన్సమ్ గ్రీన్ అపార్ట్‌మెంట్‌లో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. కెకె.రాజు హాజరై మాట్లాడుతూ, ప్రతి ఒక్కరు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో 51 వార్డు కార్పొరేటర్ రేయ్యి వెంకట రమణ, అమర్ రెడ్డి, ప్రభాకర్, అనిల్‌కుమార్, ఎవిఎన్.రాజు తదితరులు పాల్గొన్నారు.

రైల్వే న్యూ కాలనీ మసీదు వద్ద ముస్లిం పెద్దలను కెకె.రాజు కలిశారు. వైసిపి గెలుపునకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సనపల చంద్రమౌళి, బాణాల శ్రీనివాస్, ఆళ్ల లీలావతి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

యాదవ సంఘాలతో వైసిపి ఆత్మీయ సమావేశం

ఆత్మీయ సమావేశంలో మేయర్ హరివెంకట కుమారి, ఆడారి ఆనంద్ కుమార్‌ను సత్కరిస్తున్న యాదవ సంఘం ప్రతినిధులు

ప్రజాశక్తి -గోపాలపట్నం : జివిఎంసి 91, 92 వార్డుల యాదవ సంఘాలతో కుమారి కల్యాణ మండపంలో వైసిపి ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా జివిఎంసి మేయర్ గొలగాని హరివెంకటకుమారి హాజరై మాట్లాడుతూ, వైసిపి పశ్చిమ నియోజకవర్గం అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్‌కు, ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీకి యాదవులంతా ఓటువేసి గెలిపించాలని కోరారు. అనంతరం మేయర్‌ను, ఆడారి ఆనంద్ కుమార్‌ను యాదవ సంఘం నాయకులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు బెహరా భాస్కరరావు, పేడాడ రమణి కుమారి, గేదెల మురళీకృష్ణ, ఉరుకూటి మహాలక్ష్మినాయుడు, ఉరుకూటి శ్రీనివాసరావు, సోమేశ్వరరావు, శంకర్, నమ్మి రమణ, ఉప్పిలి, కనకరాజు, ఆనందరావు, పీతల అప్పలరాజు, సింహాచలం పాల్గొన్నారు.

పంచకర్లకు మద్దతుగా తనయుడు ప్రచారం

ప్రచారంలో పాల్గొన్న పంచకర్ల రఘునందన్

ప్రజాశక్తి-పెందుర్తి : జివిఎంసి 92వ వార్డు పరిధి బంటాకాలనీలో కూటమి అభ్యర్థి పంచకర్ల రమేష్‌బాబుకు మద్దతుగా ఆయన తనయుడు రఘునాథన్ శుక్రవారం ప్రచారం చేశారు. ఈ సందర్భంగా రఘునాథన్ మాట్లాడుతూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు రావాలంటే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావాలన్నారు. చంద్రబాబు హయాంలో హైదరాబాదును హైటెక్ సిటీగా తయారుచేశారని గుర్తుచేశారు. పంచకర్ల రమేష్ బాబు గతంలో ఈ ప్రాంతాన్ని ఎంతగానో అభివృద్ధి చేశారని, మరోసారి అవకాశమిస్తే మరింత అభివృద్ధి చేస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో 94వ వార్డు కార్పొరేటర్ బల్ల శ్రీనివాసరావు, ఎంపిటిసి సభ్యులు గొల్లవిల్లి రమణ, సర్పంచ్ గొర్లె రామకృష్ణ, 94వ వార్డు జనసేన పార్టీ అధ్యక్షులు పి.పార్వతి, జనసేన నాయకులు కోడిగుడ్ల వెంకటస్వామి, కోడిగుడ్ల ఈశ్వరరావు, నీలం శెట్టి శివ, గండ్రెడ్డి రమేష్, నీలంశెట్టి సాయికిరణ్, బంటా కాలనీ జనసేన నాయకులు ఆనంద్, పవన్, మురళి టిడిపి నాయకులు సేనాపతి రామకృష్ణ, బొబ్బరి రాము, ఎర్ర ప్రశాంతి, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

కాలువలో పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి -ములగాడ : మల్కాపురం ప్రధాన కాలువలో పడి ఒకరు మృతిచెందారు. స్థానికుల కథనం ప్రకారం... మల్కాపురం గొల్లవీధిలో కర్రి రాజు భార్య పిల్లలతో కలిసి నివాసముంటున్నాడు. శుక్రవారం రాత్రి కర్రి రాజు బహిర్భూమికి వెళ్లాడు. కాలువ పక్కకు వెళ్లడంతో ఒక్కసారిగా కాలుజారి పడిపోయాడు. అటుగా వెళ్లిన స్థానికులు గమనించి బయటకు తీశారు. అప్పటికే మృతిచెందడంతో ఆయన కుటుంబ సభ్యులకు సమాచారాన్ని అందించారు. భార్య, పిల్లలు సంఘటనా స్థలానికి చేరుకొని బోరున విలపించారు.

ఎన్ఎస్‌టిఎల్‌లో సాంకేతిక దినోత్సవాన్ని ప్రారంభిస్తున్న ప్రతినిధులు

ఘనంగా జాతీయ సాంకేతిక దినోత్సవం

ప్రజాశక్తి -కరాస: జాతీయ సాంకేతిక దినోత్సవం సందర్భంగా విశాఖపట్నంలోని డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ ప్రధాన నౌకా పరిశోధన ప్రయోగశాల నేవల్ సైన్స్ అండ్ టెక్నలాజికల్ లేబొరేటరీ ఎన్ఎస్‌టిఎల్ మానసి ఆడిటోరియంలో జాతీయ సాంకేతిక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పూణేలోని ఆర్మమెంట్ రీసెర్చ్ డెవలప్‌మెంట్ ఎస్టాబ్లిష్‌మెంట్ మాజీ డైరెక్టర్ సురేంద్ర కుమార్, డిఆర్‌డిఒ నేవల్ సిస్టం అండ్ మెటీరియల్స్ డైరెక్టర్ జనరల్ వై.శ్రీనివాసరావు హాజరై మాట్లాడారు. విద్యార్థులు వినూత్న ఆలోచనలతో ప్రాథమిక పరిశోధనల నుంచి అనువర్తిత పరిశోధనల వైపు మళ్లాలని సూచించారు. కొత్త ఆలోచనలతో వర్ధిల్లుతున్న భారతదేశం కొత్త టెక్నాలజీల యుగంలోకి మారుతోందని చెప్పడంలో ఎటువంటి సందేహమూ లేదన్నారు. అనంతరం డిఆర్‌డిఒ ప్రయోగశాల వివిధ సాంకేతిక విజయాలను వివరించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు, అధికారులు, పాల్గొన్నారు.

గున్నారావు సేవలు మరువలేనివి

ప్రజాశక్తి -తగరపువలస : సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులుగా, చిట్టివలస లేబర్ యూనియన్ ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన కీర్తిశేషులు తెడ్లాపు గున్నారావు ప్రజా, జ్యూట్ కార్మికుల సమస్యలపై నిరంతరం పనిచేశారని సిపిఐ, చిట్టివలస లేబర్ యూనియన్ నాయకులు కొనియాడారు. స్థానిక జిఆర్ భవన్‌లో గున్నారావు వర్ధంతి సభ శుక్ర వారం నిర్వహించారు. ముందుగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, యూనియన్ నాయకులు అల్లు బాబూరావు, కానూరి రాంబాబు, చిల్ల నరసింహులు తదితరులు మాట్లాడుతూ, రైతు, కార్మిక, ప్రజా సమస్యలపై జరిపిన పోరాటాలకు ఆయన నాయకత్వం వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కిల్కారి మొబైల్ సేవలపై అవగాహన

ప్రజాశక్తి-ఆనందపురం : కిల్కారి మొబైల్ అకాడమి సేవలు వినేలా గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించాలని కిల్కారీ మొబైల్ అకాడమీ ప్రాంతీయ కార్యక్రమ అధికారి ఆర్.మోహనరావు కోరారు. ఆనందపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎఎన్ఎం, ఆశ కార్యకర్తలకు కిల్కారీ మొబైల్ సేవలపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణిగా ఉన్న నాలుగో నెల నుంచి బిడ్డ పుట్టిన తరువాత ఏడాది వరకు ఎలాంటి చర్యలు తీసుకోవాలన్నదానిపై అవగాహన కల్పిస్తారని, ఇది పూర్తిగా ఉచితం అని తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖ పరిధిలో ఈ అకాడమీ పనిచేస్తుందన్నారు. గర్భిణీ నమోదు చేసినప్పుడు ఇచ్చే మొబైల్ నెంబర్‌కు ఎటువంటి చర్యలు తీసుకుంటే ఆరోగ్యవంతమైన బిడ్డకు పుడతారు అనేది ఎఎన్ఎం తెలియజేస్తారని చెప్పారు. జిల్లా కమ్యూనిటీ మొబలైజర్ వి.మణికుమారి మాట్లాడుతూ, గర్భిణులు, బాలింతలు ఏదైనా అవగాహన కోసం 01244451660, 14423 నెంబర్లకు కాల్ చేయవచ్చని, ఇది పూర్తిగా ఉచితం అని తెలిపారు. గర్భిణీగా ఎఎన్ఎం వద్ద నమోదు చేసుకున్న నంబర్‌తో చేయాలన్నారు. ఆశ కార్యకర్తలు కిల్కారి మొబైల్ అకాడమీ అందించే కోర్సును పూర్తి చేసి, పరీక్ష ఉత్తీర్ణత పొందాలని సూచించారు. ఈ సందర్భంగా కిల్కారీ సేవలపై అవగాహన కల్పించే పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య అధికారి పి.సాంబమూర్తి, ఆరోగ్య పర్యవేక్షకులు కృష్ణమోహన్, పార్వతమ్మ, ఆరోగ్య కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com
విశాఖ, అనకాపల్లి
శనివారం
11 మే 2024

కలం మాట

కత్తి

ఓటు..
వాడీవేడి కత్తి
ప్రజాస్వామ్య సార్వభౌమ
సంపత్తి
నీవు గెలవలేవు.
కులమతాలను ఎత్తి
అవినీతిని విత్తి...

ఎదురీత

కులాల కూత
మత మౌఢ్యాల మోత
ధన దౌర్జన్యాల రోత
భరిస్తూ
దేశ ప్రజాస్వామ్యానికి
ఎన్నాళ్లీ ఎదురీత...

విలువ

నాటి నాయకులకు
కోట్ల ప్రజల్లో ఉన్న
విలువ...
నేటి నాయకులకు
కోటాను కోట్లు ఉన్న
నిలువ...

జనం... ధనం



నాడు
జనం ఓటే శాసనం
నేడు
ధనం మాటే
ధనం మూటే
సింహాసనం

-ఎ.జనార్ధనం, మధురానగర్, విశాఖ,
మొబైల్ : 96420 11281

వైసిపిలోకి చేరికలు



వైసిపిలో చేరిన వారితో వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఉమాశంకర్ గణేష్

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని అమ్మపేట గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ సమక్షంలో వైసీపీలో చేరారు. గ్రామ మాజీ ఎంపిటిసి గొర్లి వెంకటరమణతో పాటు 20 కుటుంబాలు పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో గొలుగొండ జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు, సీనియర్ నాయకులు రుత్తల యర్రాపాత్రుడు తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి డెస్క్ : నర్సీపట్నం ఎమ్మెల్యే, వైసీపీ అభ్యర్థి పెట్ల ఉమాశంకర్ గణేష్ సమక్షంలో నర్సీపట్నం నియోజకవర్గం నుంచి వివిధ ప్రాంతాలకు చెందిన టీడీపీ నాయకులు వైసీపీలో చేరారు. నర్సీపట్నం మున్సిపాలిటీ గొలుగొండ మండలం పాత మల్లంపేట పంచాయతీ ఉగ్గంపేట, నాతవరం మండలం ఎస్‌బి.పట్నం పంచాయతీ ఎ.శరభవరం, మాకవర పాలెం మండలం కొండలగ్రహారం గ్రామాలకు చెందిన పలువురు వైసీపీ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే గణేష్ పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

ఆధునికీకరణకు నోచుకోని రైవాడ రిజర్వాయర్

మాడుగుల రాజకీయం...
రసవత్తరం..!

- పోటీ అభ్యర్థులను ప్రకటించి, మార్చిన ప్రధాన పార్టీలు
- ఫలితాలను ప్రభావితం చేసేలా రాజకీయ పరిణామాలు
- మాట వరసకైనా ప్రధాన సమస్యలను ప్రస్తావించని నేతలు

మాడుగుల అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రస్తుత ఎన్నికల్లో ఆసక్తికర పరిణామాలు చోటుచేసుకున్నాయి. ప్రధాన పార్టీలు ముందుగా ప్రకటించిన అభ్యర్థులను మార్పు చేయడం, వైసిపి అభ్యర్థికి ఇంటిపోరు, టిడిపిలో గ్రూపుల గోల.. ఇలా ప్రతి పరిణామం చర్చనీయాంశంగా మారింది. దీంతో ఎన్నికల ఎజెండాగా మారాల్సిన నియోజకవర్గంలోని ప్రధాన ప్రజాసమస్యలన్నీ మరుగున పడిపోయాయి. దేశం, రాష్ట్రంలోని పరిస్థితుల ప్రస్తావన కన్నా, స్థానిక రాజకీయాల చుట్టూ అంతా తిరుగుతూ, ఎవరు ఎటువైపు ఉన్నారు? ఎవరు, ఎవరికి ఓటేస్తారు? ఎవరు గెలుస్తారు? అనే దానిపైనే అంతా ఫోకస్‌గా ఉంది.

(ప్రజాశక్తి- కె.కోటపాడు)

మాడుగుల నియోజకవర్గంలో ప్రస్తుతం జరగబోయే ఎన్నికలు ఆసక్తికరంగా ఉన్నాయి. నోటిఫికేషన్ దగ్గర నుంచి అభ్యర్థుల ప్రకటన, నామినేషన్ల దాఖలు, ఉపసంహరణ వరకు అన్నింటా ట్విస్ట్‌లే ట్విస్ట్‌లు. చివరకు పోటీలో తొమ్మిది మంది అభ్యర్థులు నిలవగా, ప్రధాన పోటీ వైసిపి, కూటమి బలపరిచిన టిడిపి మధ్యే ఉన్నట్లు భావిస్తున్నా, మేమున్నామంటూ మూడో ప్రత్యామ్నాయంగా ఇండియా బ్లాక్ బలపరిచిన కాంగ్రెస్ పోటీ బరిలో ఉంది. ఇక ప్రధాన పార్టీలు టిడిపి, వైసిపి అభ్యర్థులను ప్రకటించడం, కారణాలేవైనా వారిని మార్పుచేయడం జరిగింది. సిటింగ్ ఎమ్మెల్యే, ఉపముఖ్యమంత్రి వైసిపి తరపున మూడోసారి పోటీలో నిలవడం ఖాయమని తొలుత భావించినా, పార్టీ అధిష్టానం అతనిని అనకాపల్లి ఎంపీ స్థానంలో పోటీలో నిలిపి, బూడి కుమార్తె ఈర్లె అనురాధకు వైసిపి టిక్కెట్ ఖరారు చేసింది. ఇక టిడిపిలోనూ ఊహించని పరిణామాలే చోటుచేసుకున్నాయి. టిడిపి తరపున మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, నియోజకవర్గ ఇన్‌ఛార్జి పివిజి.కుమార్, సీనియర్ నేత పైలా ప్రసాదరావు టిక్కెట్ ఆశించగా, పైలాకు అధిష్ఠానం టిక్కెట్ ఖరారు చేయడం, ఆయన ప్రచారంలో దిగడం చకచకా జరిగిపోయాయి. అయితే గవిరెడ్డి రామానాయుడు, పివిజి.కుమార్ నుంచి వ్యతిరేకత రావడంతో పైలా ప్రసాదరావును తప్పించి పెందుర్తి మాజీ ఎమ్మెల్యే, మాజీమంత్రి బండారు సత్యనారాయణమూర్తికి టిడిపి అధిష్టానం టిక్కెట్ ఇచ్చింది. దీంతో రెండు పార్టీల్లో కేడర్ అయోమయంలో పడక తప్పలేదు. ఇక ఇండియా బ్లాక్ బలపరిచిన కాంగ్రెస్ అభ్యర్థి బొడ్డు శ్రీనివాసరావు మూడో ప్రత్యామ్నాయంగా పోటీలో ఉన్నారు. వామపక్షాలు, ఇండియా ఫోరంలోని ఇతర పార్టీలు, ప్రజాసంఘాల మద్దతుతో ముందుకు సాగుతున్నారు.

వైసిపికి ఇంటిపోరు.. అసమ్మతి జోరు

మాడుగుల టిక్కెట్ సిటింగ్ ఎమ్మెల్యే బూడి ముత్యాలనాయుడుకు ఇస్తే హ్యాట్రిక్ విజయం ఖాయమని భావిస్తున్న తరుణంలో అతనిని తప్పించి బూడి కుమార్తె, కె.కోటపాడు జెడ్‌పిటిసి ఈర్లె అనురాధకు కేటాయించడం వైసిపికి నష్టమేనని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇదే తరుణంలో బూడికి ఇంటిపోరు కూడా తోడై ఆయన కుమారుడు బూడి రవికుమార్ ఇండిపెండెంట్‌గా పోటీలో నిలిచి, తన తండ్రి కంటే తానే నియోజకవర్గాన్ని బాగా అభివృద్ధి చేస్తానంటూ వ్యతిరేక ప్రచారం మొదలెట్టారు. దీనికితోడు దేవరాపల్లిలో పార్టీకి పట్టున్న నాయకులు మాజీ ఎంపిపి కిలపర్తి భాస్కరరావు, ఆయన సతీమణి ఎంపిపి కిలపర్తి రాజేశ్వరి, మారేపల్లికి చెందిన సీనియర్ నాయకులు ఆవుగడ్డ రామ్మూర్తినాయుడు వైసిపికి రాజీనామా చేసి టిడిపిలో చేరడం, కె.కోటపాడు మండలంలో మాజీ సర్పంచ్, డిసిసిబి డైరెక్టర్, గొండుపాలెం మాజీ సర్పంచ్ బండారు రామస్వామిపాత్రుడు వైసిపిని వీడడం జరిగింది. దీంతో అంతా అనుకూలంగా ఉన్న వైసిపికి గడ్డు పరిస్థితి ఎదురైందని భావిస్తున్నారు. బూడి కుమార్తె ఈర్లె అనురాధకు టిక్కెట్ ఇవ్వడం వల్లే ఈ పరిణామాలు చోటుచేసుకున్నాయని అంటున్నారు.

నివురుగప్పిన నిప్పులా టిడిపిలో గ్రూపులు

మరోవైపు టిడిపికి మాడుగులలో పరిస్థితులు ఏమంత సాఫీగా లేవు. ముగ్గురు ఆశావహుల్లో ఒక్కరైన పైలా ప్రసాదరావుకు టిక్కెట్ కేటాయించడం తర్వాత మిగిలిన ఇద్దరు అసమ్మతి, సహాయ నిరాకరణతో అనివార్య పరిస్థితుల్లో పెందుర్తి నుంచి బండారు సత్యనారాయణమూర్తిని తీసుకొచ్చి బరిలో నిలపడం వంటి పరిణామాలు చకచకా జరిగిపోయాయి. తమలో తాము సహకరించకపోయినా, ప్రత్యామ్నాయంగా వచ్చిన బండారుకు అందరూ సహకరిస్తున్నట్లు కనిపించడంతో పరిస్థితి సద్దుమణిగేలా ఉన్నా, చివరికి ఏం జరుగుతుందోనన్న సందేహాలు వ్యక్తమౌతున్నాయి. ఎప్పుడూ ప్రశాంతంగా ఉన్న మాడుగుల నియోజకవర్గం లోనూ, జిల్లాలోనూ అనకాపల్లి కూటమి ఎంపీ అభ్యర్థి సిఎం రమేష్ ఘర్షణ వాతావరణానికి కారణమవు తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇటీవల బూడి స్వగ్రామం తారువలో చోటుచేసుకున్న ఘర్షణ, కె.కోటపాడు మండలం చౌడువాడలో వైసిపి వాహనాల అడ్డగింత తదితర పరిణామాలు మాడుగుల ఎన్నికల రాజకీయాల్లో కొత్త పరిణామమని చెప్పక తప్పదు. ఇవన్నీ సిఎం రమేష్ ఫ్యాక్షన్ రాజకీయాల వల్లే జరిగాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ పరిణామాలు కూటమిపై ఎటువంటి ప్రభావం చూపుతాయోనన్న ఆందోళన కూడా కేడర్‌లో ఉంది.



బండారు సత్యనారాయణమూర్తి (టిడిపి) | ఈర్లె అనురాధ (వైసిపి) | బిబి.శ్రీనివాసరావు (కాంగ్రెస్)

ప్రజా సమస్యలే ఎజెండాగా ఇండియా బ్లాక్ ప్రచారం

ఇక మాడుగుల నియోజకవర్గంలో పోటీలో ఉన్న ఇండియా బ్లాక్ ప్రజా సమస్యలు, గత ప్రభుత్వాల వైఫల్యాలే అజెండాగా ప్రచారం సాగిస్తున్నాయి. కాంగ్రెస్ అభ్యర్థి శ్రీనివాసరావుకు మద్దతుగా సిపిఎం, సిపిఐ తదితర వామపక్ష పార్టీలు, ప్రజాసంఘాలు ప్రచారం చేస్తున్నాయి.

మరుగున పడిన ప్రజాసమస్యలు

మాడుగుల రాజకీయాల్లో ప్రధాన పార్టీల్లో చోటుచేసుకున్న పరిణామాలతో ప్రజాసమస్యల ప్రస్తావన లేకుండా పోయింది. నియోజకవర్గంలోని ఏడు ప్రధాన డ్యామ్‌లు నిర్వహణ, మరమ్మతులకు నోచుకోక ఆయకట్టుకు సాగునీరు అందని పరిస్థితి ఉన్నా ఈ విషయాన్ని పట్టించుకునే దిక్కులేదు. రైవాడ రిజర్వాయర్ కింద ఆరువేల ఎకరాల అదనపు ఆయకట్టుకు సాగునీటి స్థిరీకరణ చేయాల్సి ఉన్నా, దాని ఊసెత్తే వారే కరువయ్యారు. కూరగాయలు, మామిడి పంటలను ఎక్కువగా సాగుచేసే మెట్టు ప్రాంతమున్న కె.కోటపాడులో పంట ఉత్పత్తుల నిల్వకు కోల్ట్‌స్టోరేజీ ఏర్పాటు ప్రతిపాదన ఇప్పటివరకు ఒక్కడుగైనా ముందుకు వేయకపోగా, ప్రస్తుతం దీనిపై చర్చించే నాధులే లేకుండా పోయారు. దేవరాపల్లి, చీడికాడ, వి.మాడుగుల మండలాల్లోని నాన్‌షెడ్యూల్డ్ గిరిజన గ్రామాలను షెడ్యూల్డ్ ప్రాంతంలో చేర్చి, అనకాపల్లి జిల్లాలో ఐడిడిఎను నెలకొల్పడమో, లేకుంటే పాడేరు ఐటిడిఎలో విలీనం చేయడం ద్వారా గిరిజనులకు ప్రభుత్వ ప్రయోజనాలు, సంక్షేమ పథకాలను అందించాలన్న ప్రతిపాదనపై ప్రధాన పార్టీలు మాట్లాడడం లేదు. ఈ సమస్యలపై వామపక్షాలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో గిరిజనులు వివిధ రూపాల్లో ఆందోళనలు చేసినా, ప్రస్తుత ఎన్నికల్లో ప్రధాన పార్టీల హామీల్లోగానీ, అజెండాలోగానీ ఈ సమస్యకు చోటు దక్కలేదు.

ఇప్పటి వరకు ఎమ్మెల్యేలు... ప్రస్తుత పోటీ అభ్యర్థులు వీరే...

మాడుగుల నియోజకవర్గంలో తొలిసారిగా 1952లో ఎన్నికలు జరిగాయి. ఇప్పటివరకు 16సార్లు ఎన్నికలు జరగ్గా,. ఆరుసార్లు తెలుగుదేశం పార్టీ అభ్యర్థులు విజయం సాధించగా, నాలుగుసార్లు కాంగ్రెస్, రెండుసార్లు వైసీపీ అభ్యర్థులు విజయం సాధించారు. 1983 నుంచి 1999 వరకు టిడిపి తరపున రెడ్డి సత్యనారాయణ వరుసగా ఐదుసార్లు విజయం సాధించగా, గడచిన రెండు ఎన్నికల్లో వైసిపి తరపున బూడిముత్యాలనాయుడు వరుసగా గెలుపొందారు. ప్రస్తుతం టిడిపి అభ్యర్థిగా బండారు సత్యనారాయణమూర్తి, వైసిపి తరపున ఈర్లె అనురాధ, ఇండియా బ్లాక్ బలపరిచి కాంగ్రెస్ అభ్యర్థిగా బిబి. సత్యనారాయణతోసహా మొత్తం 9మంది పోటీ బరిలో ఉన్నారు.

ఎన్నికల కమాండ్ కంట్రోల్ రూంను పరిశీలిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

కమాండ్ కంట్రోల్ రూమ్‌ను సందర్శించిన కలెక్టర్

ప్రజాశక్తి- విశాఖపట్నం : సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా కలెక్టరేట్ మొదటి అంతస్తులో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్‌ను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ ఎ. మల్లికార్జున శుక్రవారం సాయంత్రం సందర్శించారు. జిల్లాలోని క్లిష్టతరమైన పోలింగ్ కేంద్రాల్లో అమర్చుతున్న వెబ్ కాస్టింగ్ ప్రక్రియను డ్యాష్ బోర్డు ద్వారా పరిశీలించారు. ఇప్పటి వరకు ఎన్ని కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ పెట్టారు, ఇంకా ఎన్నిచోట్ల పెట్టాల్సి ఉందని అక్కడ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల నిర్వహణకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా నిర్ణీత సమయంలో వాటన్నింటినీ అమర్చాలని, కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేయాలని సూచించారు. డ్యాష్ బోర్డు సహాయంతో కొన్ని కేంద్రాల వద్ద అమర్చిన కెమెరాలను స్వయంగా పరిశీలించారు. అక్కడ పరిస్థితిని గమనించారు.

'మన పోరాటం' 9వ పాటను విడుదల చేస్తున్న చంద్రబాబు

మన పోరాటం 9వ పాట విడుదల

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్: తెలుగు శక్తి ఆధ్వర్యంలో 'మన పోరాటం' 9వ పాటను టిడిపి అధినేత చంద్రబాబు శుక్రవారం పార్టీ కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం సాగిస్తున్న అరాచక పాలన పై తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ చేస్తున్న నిరంతర పోరాటం అభినందనీయమన్నారు. ప్రతి ఒక్కరూ రామ్ స్ఫూర్తి తో అన్యాయం, అరాచకాలను ఎదిరించాలన్నారు.ఒక ఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన జగన్మోహన్ రెడ్డిని ప్రజలు నమ్మే పరిస్థితి ఎంతమాత్రం లేదన్నారు.

తెలుగు శక్తి అధ్యక్షుడు బివి రామ్ మాట్లాడుతూ ప్రజల బాధలు, కష్టాలను దృష్టిలో ఉంచుకొని, వాటికి అద్దం పట్టే విధంగా మన పోరాటం, ఇతర పాటలు ఉన్నాయని, వీటికి ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తుందన్నారు. రాబోయే ఎన్నికలలో కూటమి అభ్యర్థులు ఘన విజయం సాధిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

కాంగ్రెస్ అభ్యర్థి విస్తృత ప్రచారం

పలు ప్రాంతాల్లో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి శ్రీనివాస్

ప్రజాశక్తి -చోడవరం : చోడవరం నియోజకవర్గం కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి జగతా శ్రీనివాసరావు శుక్రవారం చోడవరం పట్టణం, వడ్డాది జంక్షన్లో ప్రచారం చేపట్టారు. నర్సాపేట, గాంధీ గ్రామం, కొత్తూరు జంక్షన్, ఆర్ టి సి కాంప్లెక్స్, చిన్న బజార్ తదితరు చోట్ల ర్యాలీ నిర్వహించి హస్తం గుర్తుపై ఓటు వేయాలని గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. దశాబ్ద కాలంగా కాంగ్రెస్ పార్టీ కనపడని చోడవరం నియోజకవర్గంలో శ్రీనివాస్ ప్రచారంతో ఆ పార్టీ అభిమానులు తప్పనిసరిగా ఓటు వేస్తామని హామీ ఇచ్చారు. శ్రీనివాస్ మాట్లాడుతూ తమ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే, ప్రత్యేక హెూదా ఇస్తామని, విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటుపరం కాకుండా చూస్తామని, సుగర్ ఫ్యాక్టరీ రైతులకు టన్నుకు రూ.4వేలు మద్దతు మద్దతు ధర ఇస్తామని చెప్పారు.

ప్రణాళికాయుతంగా అభివృద్ధి చేస్తా

- 36వ వార్డు ఎన్నికల ప్రచారంలో వంశీకృష్ణ శ్రీనివాస్

36వ వార్డులో ప్రచారం నిర్వహిస్తున్న వంశీకృష్ణ శ్రీనివాస్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ప్రతి వార్డు అభివృద్ధికి ప్రణాళిక రూపకల్పన చేసి వాటిని అమలు చేయడం ద్వారా ప్రజలకు అభివృద్ధి అంటో ఏంటో చూపించి, దక్షిణ నియోజకవర్గంలో చిరస్థాయిలో నిలిచిపోయే రీతిలో పనిచేస్తానని కూటమి బలపరిచిన జనసేన అభ్యర్థి వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం 36వ వార్డు గాంధీపేట, బురుజుపేట, కనకమాలక్ష్మి ఆలయ ప్రాంగణ ప్రాంతాలలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గాజుగ్లాసు గుర్తుపై ఓట్లు వేసి దక్షిణ ఎమ్మెల్యేగా తనను, సైకిల్ గుర్తుపై ఓటు వేసి విశాఖ పార్లమెంట్ అభ్యర్థి శ్రీభరత్‌ను గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో టిడిపి,బిజెపి,జనసేన శ్రేణులు పాల్గొన్నారు.

ముమ్మరంగా ధర్మశ్రీ ఇంటింటా ప్రచారం

ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న ధర్మ శ్రీ

ప్రజాశక్తి -చోడవరం : చోడవరం వైసీపీ అభ్యర్థి కరణం ధర్మశ్రీ చోడవరం పట్టణంలో శుక్రవారం పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించారు. దొడ్డివీధి, పిల్లవారి తోట, ఎడ్ల వీధి, ఐటీ కాలనీ, చిన్నబజార్ తదితర చోట్ల ఇంటింటికి వెళ్లి, వైసిపి పాలనలో అమలు చేసిన పథకాలను వివరిస్తూ తమకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ప్రచారంలో పెద్ద ఎత్తున మహిళలు పాల్గొని ధర్మశ్రీకి మద్దతు తెలిపారు. చోడవరం ఎమ్మెల్యేగా తనను, అనకాపల్లి ఎంపీగా బూడి ముత్యాలనాయుడుకు ఫ్యాన్ గుర్తుపై ఓటేసి గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులతో పాటు పలువురు వైసిపి కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అలాగే ధర్మ శ్రీ సోదరుడు రమణమూర్తి పట్టణంలో అనేక సంఘాలతో సమావేశం నిర్వహించి, తన సోదరునికి ఓటు వేసి గెలిపించాలని కోరారు.

ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

పోలీసుల ఫ్లాగ్ మార్చ్

ప్రజాశక్తి- కశింకోట : ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు సహకరించాలని కోరుతూ కశింకోటలో పోలీసులు శుక్రవారం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ వినోద్‌బాబు మాట్లాడుతూ ఈ నెల 13న జరుగు ఎన్నికల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రజలు సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బెటాలిన్ పోలీసులు పాల్గొన్నారు.

పేదలకు గొడుగులు, చెప్పులు పంపిణీ

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక వాసవి క్లబ్, జానకి చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం పేదలకు గొడుగులు, ఆహార ప్యాకెట్లు, చెప్పులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వాసవి క్లబ్ జోనల్ చైర్మన్ పిప్పళ్ళ సత్య మాట్లాడుతూ ఎండాకాలంలో పేదలకు చెప్పులు, గొడుగులు ఎంతో అవసరమని, అందుకే వాటిని పంపిణీ చేశామని చెప్పారు. కార్యక్రమంలో సిద్ధి లింగేశ్వర దేవస్థానం చైర్మన్ నుదురుపాటి తాతాజీ, జంగాల శ్రీనివాస్ శ్రీధరాల హరికృష్ణ, రాజేష్, శ్రీనివాస హోటల్ అధినేత శ్రీనివాస్ పాల్గొన్నారు.

రెజ్లింగ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షునిగా మాణిక్యాలు

ప్రజాశక్తి-అనకాపల్లి: రెజ్లింగ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా మాజీ ఒలింపియన్ ఎంవి మాణిక్యాలను ఎన్నుకున్నారు. చిత్తూరులో జరిగిన రెజ్లింగ్ అసోసియేషన్ ఎన్నికల్లో ఆయనను ఎన్నుకోవడం పట్ల పట్టణానికి చెందిన పలువురు ప్రముఖులు అభినందించారు. రెజ్లింగ్ క్రీడ అభివృద్ధికి తన శక్తివంచన లేకుండా కృషి చేస్తానని మాణిక్యాలు తెలిపారు.

ఏడుగురు గ్రామ వాలంటీర్లు రాజీనామా

ప్రజాశక్తి-కె.కోటపాడు : మండలంలోని ఆర్లి గ్రామ సచివాలయం పరిధిలో పని చేస్తున్న ఏడుగురు గ్రామ వాలంటీర్లు శుక్రవారం రాజీనామా చేసినట్లు ఎంపీడీవో అప్పలరాజు తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఇప్పటి వరకు మండలంలో 143 మంది వాలంటీర్లు వ్యక్తిగత కారణాల వల్ల విధుల నుంచి తప్పుకున్నట్లు చెప్పారు.

టిడిపిలో చేరిక

ప్రజాశక్తి- కశింకోట : కశింకోట మండలం చింతలపాలెం గ్రామానికి చెందిన వైసిపి నాయకులు తిర్రి సంతోష్, సోమవారం గ్రామానికి చెందిన శివ రాష్ట్ర తెలుగు రైతు అధికార ప్రతినిధి, సోమవారం మాజీ సర్పంచ్ గొంతిన శ్రీనివాసరావు సమక్షంలో శుక్రవారం టిడిపిలో చేరారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పొన్నగంటి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగిన మత్స్యకారుల ఆందోళన

ప్రజాశక్తి-అచ్యుతాపురం : పూడిమడకలో ఫిషింగ్ హార్బర్ జెట్టీ నిర్మాణానికి సర్వే నెంబర్, 12, 134 రెండు నెంబర్లలో 7 ఎకరాల విస్తీర్ణంలో భూములు అక్రమంగా స్వాధీనపరుచుకున్నారని, తమకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ గత కొన్ని రోజులుగా పూడిమడక తీరంలో మత్స్యకారులు చేస్తున్న ఆందోళన శుక్రవారం కూడా కొనసాగింది. శుక్రవారం బాధితులు చేపల తాతయ్య, పేర్ల మంగ, పేర్ల బాపునమ్మ, అంగ కామేశ్వరి, చల్లా లక్ష్మి తదితరులు చేపట్టిన ఆందోళనకు పలువురు సంఘీభావం తెలిపారు. మత్స్యకారుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించి వారికి పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు.

నిరసన తెలుపుతున్న బాధిత మత్స్యకారులు

రొయ్యల చెరువు గట్టుకు అమర్చిన విద్యుత్ తీగలు తగిలి ఇద్దరు యువకులు మృతి

రెండు కుటుంబాలకు రూ.32 లక్షలు నష్ట పరిహారం చెల్లింపునకు ఒప్పందం

ప్రజాశక్తి-అచ్యుతాపురం
పూడిమడక గ్రామంలో గురువారం రాత్రి రొయ్యల చెరువు గట్టుపై అమర్చిన విద్యుత్ తీగలు తగిలి షాక్‌కు గురై ఇద్దరు మత్స్యకార యువకులు మృతి చెందారు. పోలీసు కథనం ప్రకారం... పూడిమడకకు సమీపంలో ఉన్న రొయ్యల చెరువు చుట్టూ అపరిచితులు ప్రవేశించకుండా, చెరువు గట్టుపై విద్యుత్ దీపాలు వెలగటానికి అనుకూలంగా విద్యుత్ తీగలను యజమాని అమర్చాడు. గురువారం రాత్రి పూడిమడక పంచాయతీ కడపాలెం గ్రామానికి చెందిన ఎజ్జల సోమి నాయుడు (25) చోడిపల్లి రాజు (27) తదితర మత్స్యకార యువకులు చెరువు వద్దకు వెళ్లారు. చెరువు గట్టుపై అమర్చిన విద్యుత్ తీగలు ప్రమాదవశాత్తు ఇద్దరు యువకులకు తగలడంతో వారు అక్కడికక్కడే మృతి చెందారు. దీంతో వారి కుటుంబాలు కన్నీరుమున్నీరయ్యాయి. ఎజ్జల సోమునాయుడుకు ఇంకా పెళ్లి కాలేదు. తల్లిదండ్రులు రాజయ్య లక్ష్మి తమను చూసేవారు ఎవరని బోరున విలపించారు. చొడిపల్లి రాజుకు భార్య ముత్యాలమ్మ, పాప బాబు ఉన్నారు. జీవితాంతం పోషిస్తాడని నమ్ముకున్న వ్యక్తి దూరం కావడంతో తమ జీవన పరిస్థితి ఏమిటని లబోదిబోమని రోదిస్తున్నారు. ఇద్దరు యువకులు మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. అచ్యుతాపురం సిఐ ఎం బుచ్చిరాజు సంఘటన స్థలాన్ని సందర్శించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సోమునాయుడు, రాజు (ఫైల్‌ఫోటోలు)

సంఘటనా స్థలంలో సోమునాయుడు, రాజు మృతదేహాలు

రూ.32 లక్షలు పరిహారం ఇవ్వడానికి ఒప్పందం

మృతుల కుటుంబాలకు నష్టపరిహారం ఇవ్వాలని బాధిత కుటుంబీకులు, గ్రామస్తులు చెరువు యజమానిని డిమాండ్ చేశారు. ఈ మేరకు గ్రామస్తులకు రొయ్యల చెరువు యజమానికి మధ్య శుక్రవారం జరిగిన చర్చల్లో మృతుల కుటుంబాలకు రూ.32 లక్షలు ఇవ్వడానికి ఒప్పందం కుదిరింది.

బైక్‌ను వ్యాన్ ఢీకొని ఇద్దరు దుర్మరణం

సంఘటనా స్థలంలో గణేష్ మృతదేహం

ప్రజాశక్తి -వద్దాది
బుచ్చియ్యపేట మండలం విజయరామరాజుపేట గాయత్రి కళాశాల సమీపంలోని బియన్ రోడ్లో శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు దుర్మరణం చెందారు. పోలీసులు కథనం ప్రకారం... వీరవల్లి గ్రామానికి చెందిన విస్సారపు గణేష్, శీలం మధు వడ్డాది నుండి ద్విచక్ర వాహనంపై శుక్రవారం సాయంత్రం చోడవరం వెళుతున్నారు. విజయరామరాజుపేట గాయత్రి కళాశాల సమీపంలోకి వచ్చే సరికి ఎదురుగా వస్తున్న టాటా ఐషర్ వ్యాన్ వారిని బలంగా ఢీకొట్టింది. దీంతో విస్సారపు గణేష్ అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. తీవ్రంగా గాయపడ్డ మధును 108 వాహనంలో చోడవరం ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. సమాచారం తెలిసిన వెంటనే బుచ్చయ్య పేట ఎస్ఐ ఈశ్వరరావు ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి, మృతదేహాలను చోడవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పెద్ద సంఖ్యలో బంధువులు మృతదేహం వద్ద రోధించారు. మృతుడు గణేష్‌కు భార్య శ్యామల, ఒక బాబు ఉన్నారు. ఆయన వడ్డాదిలో ఒక ధాబాను నిర్వహిస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. రెండో మృతుడు మధుకి భార్య ప్రసన్న, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఆయన బైక్ మెకానిక్‌గా జీవనోపాధి పొందుతున్నారు.

పోలీసు అధికారులతో ఎస్‌పి సమావేశం

ప్రజాశక్తి-అనకాపల్లి
పోలీస్ అధికారులతో ఎస్పీ కెవి.మురళీకృష్ణ శుక్రవారం తన కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికలు పారదర్శకంగా, శాంతి భద్రతలకు ఎటువంటి విఘాతం కలగకుండా నిర్వహణకు, ఎన్నికలకు 72 గంటల ముందు పోలీసులు తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. జిల్లాకు వచ్చిన కేంద్ర పోలీసు బలగాల అధికారులు, డీఎస్పీలు, ఇతర అధికారులకు ఎన్నికల ప్రక్రియలో అనుసరించాల్సిన విధివిధానాలు, చేపట్టవలసిన భద్రతా చర్యలను వివరించారు. ఎన్నికల నిర్వహణ ప్రక్రియ, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ రూల్స్ తెలియజేశారు. కేంద్ర సాయుధ పోలీసు బలగాల అవసరం, మోహరింపు, ఫ్లాగ్ మార్చ్ నిర్వహణ, ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే అక్రమ మద్యం, డబ్బులు, ఇతర వస్తువులు కట్టడి, వాహనాల తనిఖీ, సెర్చ్ అండ్ సీజర్‌లు, పోలింగ్ స్టేషన్ల నిర్వహణ తదితర భద్రత సంబంధిత అంశాల గురించి ఎస్పీ వివరించారు. ఈవీఎంల డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల నుంచి పోలింగ్ స్టేషన్లకు చేరుకునే వరకు, ఓటింగ్ ముగిసిన తర్వాత పోలైన ఈవీఎంలను రిసెప్షన్ సెంటర్లకు చేరవేసే వరకు కేంద్ర పోలీసు బలగాల ఎస్కార్ట్ పటిష్టంగా నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ బి.విజయ భాస్కర్, ఎస్‌బి డీఎస్పీ బి.అప్పారావు, పరవాడ సబ్ డివిజన్ డీఎస్పీ కెవి.సత్యనారాయణ, నర్సీపట్నం సబ్ డివిజన్ డీఎస్పీ జిఆర్ఆర్.మోహన్, ఇన్స్పెక్టర్లు చంద్రశేఖర్, అప్పలనాయుడు, కుమారస్వామి, ట్రైనీ ఐపీఎస్‌లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పోలీసు అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌పి మురళీకృష్ణ

దళితుల పట్ల వైసిపి ప్రభుత్వ నిర్లక్ష్యం

ప్రజాశక్తి-అనకాపల్లి : రాష్ట్రంలో దళితుల పట్ల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం చిన్న చూపు చూసిందని జిల్లా మాల మహానాడు అధ్యక్షులు రేబాక రామారావు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ దళితవాడలను పంచాయతీలు చేసినా వాటికి నిధులు కేటాయించకపోవడం దారుణమన్నారు. 2024 వైసీపీ మేనిఫెస్టోలో దళితులకు ఒరిగిందేమీ లేదన్నారు. దశాబ్దాల తరబడి దళితుల స్వాధీనంలో ఉన్న ప్రభుత్వ భూములను వైసిపి ప్రభుత్వం అభివృద్ధి పేరుతో లాక్కుందని పేర్కొన్నారు. దళితులను అవమానించిన వారికి, దళితుల్ని చంపిన వారికి వైసీపీ ప్రభుత్వం పెద్దపీట వేయడం పట్ల జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వానికి దళితుల పట్ల ఉన్న చిత్తశుద్ధిని నిరూపిస్తుందన్నారు.

కొణతాల ప్రచారం

ప్రజాశక్తి-కశింకోట : మండలంలోని బయ్యవరం గ్రామంలో గురువారం రాత్రి కూటమి అభ్యర్థి కొణతాల రామకృష్ణ ఎన్నికల ప్రచారం చేశారు. కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు పీలా గోవింద సత్యనారాయణ, కూటమి నాయకులు పాల్గొన్నారు.

అనకాపల్లి : వైసిపి ప్రభుత్వం రాష్ట్రంలో కమ్మరి కుమ్మరులకు అన్యాయం చేసిందని లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షులు భీశెట్టి బాబ్జి విమర్శించారు. మండలంలోని తుమ్మపాల గుండాలవీధి ప్రాంతాల్లో కూటమి అభ్యర్థుల తరఫున ఎన్నికల ప్రచారం శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో న్యాయవాది పిల్లా హర శ్రీనివాసరావు, కొలసాని రమణ పాల్గొన్నారు.

వైసిపి నేతల ప్రచారం

ప్రజాశక్తి-పరవాడ : మండల కేంద్రం పరవాడ గ్రామంలో ఉపాధి హామీ కూలీలను పని ప్రదేశంలో శుక్రవారం వైసిపి నాయకులు కలిసి ఎన్నికల ప్రచారం చేశారు. వైసిపి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు అన్నంరెడ్డి అదీప్‌రాజ్, బూడి ముత్యాలనాయుడును గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర సిఇసి సభ్యులు పైల శ్రీనివాసరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రాము నాయుడు, పరవాడ ఉప సర్పంచ్ బండారు రామారావు, నాయకులు కోన రామారావు, వెన్నెల సన్యాసిరావు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

స్వతంత్ర అభ్యర్థి గుంటూరు ప్రచారం

ప్రజాశక్తి- సబ్బవరం : పెందుర్తి నియోజకవర్గం స్వతంత్ర అభ్యర్థి గుంటూరు వెంకట నరసింహారావు శుక్రవారం మండలంలోని వంగలి, పెదనాయుడు పాలెం గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి బ్యాలెట్ నమూనా పత్రాలను పంపిణీ చేసి ఉంగరం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో గుంటూరు భారతి, ముఖేష్, సాయి ప్రియ, పూజిత తదితరులు పాల్గొన్నారు.

ఓటు వేసి ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించండి

ప్రజాశక్తి -అనకాపల్లి : ప్రతి ఓటరూ తమ ఓటు హక్కును వినియోగించుకొని ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షులు బల్లా నాగభూషణం పిలుపునిచ్చారు. ఈ మేరకు 'ప్రజాస్వామ్యాన్ని పరిరక్షిద్దాం- ఓటు హక్కును ఉపయోగించుకుందాం, మన ఓటు-మన హక్కు నినాదాలతో అసోసియేషన్ ముద్రించిన కరపత్రాలను శుక్రవారం పట్టణంలోని మెయిన్ రోడ్, చేపల బజార్, కస్పావీధి, కుంచా వారి వీధి, రామాలయం జంక్షన్, పిళ్లా వారి వీధి తదితర ప్రాంతాల్లో పంపిణీ చేసి విస్తృతంగా ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి వినకోట నీలేశ్ గుప్తా, పెదిరెడ్ల సుజాత, ఓటర్లు పాల్గొన్నారు.

కరపత్రాలతో ప్రచారం నిర్వహిస్తున్న నాగభూషణం తదితరులు

కంపెనీలు తీసుకొస్తానంటూ

సిఎం రమేష్ మాయమాటలు

కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వెంకటేష్

ప్రజాశక్తి -కోటవురట్ల:మూతపడ్డ చక్కెర కర్మాగారాల్లో ఈథనాల్ కంపెనీలు తీసుకొస్తామంటూ బిజెపి ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్ మాయ మాటలు చెపుతున్నారని అనకాపల్లి కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి వేగి వెంకటేష్ ఆరోపించారు. మండలంలో శుక్రవారం ఆయన పలు గ్రామాల్లో సందర్శించారు. అనంతరం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, ఈథనాల్ కంపెనీ తీసుకువచ్చి ఫ్యాక్టరీ ఆస్తులను స్వాధీనం చేసుకోవడమే లక్ష్యంగా పావులు కదుపుతున్నారన్నారు. ఈథనాల్ కంపెనీలు తీసుకురావడంతో భూగర్భ జలాలు అడుగంటమే కాకుండా, తాగు, సాగునీటికి ఇబ్బందులు తలెత్తుతాయని తెలిపారు. దేశాన్ని సర్వనాశనం చేసేందుకే బిజెపి కంకణం కట్టు కుందన్నారు. ఐదు సంవత్సరాలు పరిపాలించిన వైసిపి ఏమి ఉద్ధరించిందని ప్రశ్నించారు. జిల్లా వ్యాప్తంగా రహదారులన్నీ ధ్వంసం అయ్యాయని, పట్టించుకునే నాథుడే లేడన్నారు. కాంగ్రెస్‌కు పూర్వవైభవం తీసు కొచ్చేందుకు పిసిసి చీఫ్ షర్మిల సర్వసక్తులు ఒడ్డుతున్నారని, ఆమె నాయకత్వంలో భవిష్యత్తులో రాష్ట్రానికి మంచి రోజులు రానున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కేవీపీ రాజు, మాజీ ఎంపీటీసీ సభ్యులు నడుంపల్లి నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వెంకటేష్

మాట్లాడుతున్న గీతాంజలి

బాధ్యతగా ఎన్నికల విధులు నిర్వహించాలి

- ఆర్ఓ గీతాంజలి

ప్రజాశక్తి-నక్కపల్లి:బూత్ లెవెల్ అధికారులు బాధ్యతగా ఎన్నికల విధులు నిర్వహించాలని పాయకరావుపేట నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి గీతాంజలి సూచించారు. స్థానిక ఆర్ఓ కార్యాలయంలో శుక్రవారం బూత్ లెవెల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. పోలింగ్ బూత్‌ల వద్ద అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. వృద్ధులు, వికలాంగులు త్వరితగతిన ఓట్లు వేసే విధంగా పోలింగ్ స్టేషన్ వద్ద ఏర్పాట్లు చేయాలని సూచించారు. పోలింగ్ స్టేషన్ వద్ద వీల్ చైర్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

పరామర్శిస్తున్న ఈసి, టెక్నికల్ అసిస్టెంట్

పాము కాటుతో ఉపాధి కూలీకి అస్వస్థత

ప్రజాశక్తి-గొలుగొండ: మండలం పాకలపాడు గ్రామానికి చెందిన రొంగల రాజుబాబు అనే ఉపాధి కూలీ శుక్రవారం ఉదయం పాముకాటుకు గురయ్యాడు. ఉదయం ఉపాధి పనులకు వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. దీంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఉపాధి కూలీని ఉపాధి హామీ పథకం ఈసీ రాధిక, టెక్నికల్ అసిస్టెంట్ ఆసుపత్రిలో పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించేందుకు ఉన్నతాధికారులకు తెలియజేస్తామని చెప్పారు.

శిథిలమైన నిర్మాణాలను చూపుతున్న సంఘం నేతలు

అల్లూరి స్మారక మందిరాలపై నిర్లక్ష్యం

ప్రజాశక్తి-గొలుగొండ: అల్లూరి సీతారామరాజు స్మారక మందిరాల నిర్వహణలో ప్రభుత్వం ఐదేళ్ల పరిపాలనలో నిర్లక్ష్యం వహించిందని జాతీయ అల్లూరి సీతారామరాజు యువజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు పడాల వీరభద్రరావు ఆరోపించారు. శుక్రవారం ఆయన స్థానిక అల్లూరి సీతారామరాజు స్మారక పార్కును సందర్శించిన సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ,వైసిపి పరిపాలనలో పార్కు అభివృద్ధికి కోటీ 16 లక్షలు ప్రకటించి ఒక్క రూపాయి కూడా విడుదల చేసి అభివృద్ధి చేయలేదని విమర్శించారు. పార్కులోని భవనాలన్నీ శిథిలావస్థకు చేరుకున్నాయన్నారు.పార్కును సందర్శించే పర్యాటకులకు గుక్కెడు మంచినీళ్లు కూడా లేని పరిస్థితి నెలకొందన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ అల్లూరి సీతారామరాజు యువజన సంఘం కార్యదర్శులు శ్యామలా వరలక్ష్మి, శివంగి నాగేశ్వరరావు, అంబటి వరహాలు రాజు, విశాఖ జిల్లా గాం గంటం దొర మల్లు దొర సేవా సంఘం ప్రధాన కార్యదర్శి వారం రామచంద్రబాబు నాయుడు, కార్యదర్శి కంబాల శంకర్రావు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో భారీ వర్షం

రోడ్లన్నీ జలమయం

కోటవురట్ల మండల పరిషత్ కార్యాలయం, రహదారిపై నిలిచిన వర్షపు నీరు

ప్రజాశక్తి-కోటవురట్ల:మండలంలో శుక్రవారం భారీ వర్షం కురిసింది. దీంతో, రోడ్లన్నీ జలమయ్యాయి. ఉదయం నుంచి సూర్యుడు తన ప్రతాపాన్ని చూపగా మధ్యాహ్నం మూడు గంటల సమయంలో ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు చోటు చేసుకుని ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈ వర్షానికి రోడ్లన్నీ జలమయమయ్యాయి. మండల పరిషత్ కార్యాలయం, ప్రధాన రహదారిపై చెరువులు తలపించే విధంగా నీరు నిలిచింది. దీంతో వాహనదారులు ఇబ్బంది పడ్డారు. ఏళ్ల తరబడి ఈ సమస్యను పరిష్కరించడంలో మండల పరిషత్ అధికారులు స్పందించక పోవడం శోచనీయం.ప్రస్తుతం కురిసిన వర్షానికి ప్రధానంగా చేతికొచ్చిన నువ్వుల పంట దెబ్బతింది. ఏడు సెంటీమీటర్లు వర్షపాతం నమోదు అయినట్లు స్థానిక డిప్యూటీ తహసిల్దారు అన్నాజీరావు తెలిపారు.

బుచ్చయ్యపేట:మండలంలో శుక్రవారం భారీ వర్షం కురిసింది. వేసవతాపం నుండి విలువలాడిన ప్రజానీకానికి ఈ వర్షం ఉపశమనం కల్గించింది. మండలంలోని పలు గ్రామాల్లో గురువారం రాత్రి ఓ మోస్తారు వర్షం కురిసింది. శుక్రవారం మధ్యాహ్నం భారీ వర్షం కొరవడంతో పొలాల్లో నీరు చేరింది. పలు రకాల సాగు పంటలకు ఈ వర్షం ఎంతగానో ఉపయోగ పడుతుందని రైతులు, కౌలు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అల్పాహారం అందిస్తున్న నారాయణరావు

సమ్మర్ కోచింగ్ క్యాంపు ప్రారంభం

ప్రజాశక్తి-అనకాపల్లిడెస్క్:నర్సీపట్నం ఆర్ఫీ మార్షన్‌లో ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో కరాటే సమ్మర్ కోచింగ్ క్యాంపు ప్రారంభించారు. సుమారు 50 మందికి పైగా హాజరైన పిల్లలందరికి పౌష్టికాహారం(గుడ్లు, బ్రెడ్లు వగైరా) ఉచితంగా అందజేశారు. వేసవి సెలవుల్లో ఈ శిక్షణతో సమయం వృథా కాదని, పిల్లల్లో స్వయం సంరక్షణకు, శరీర ఆరోగ్యానికి ఎంతో ఉపయోగ పడుతుందని అకాడమీ చైర్మన్ వెలగా నారాయణరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో జి.శ్రీరామ్మూర్తి, మోడల్ స్కూల్ ఆంగ్ల ఉపాధ్యాయుడు మధు, మెయిన్ కోచ్ రామోజు ప్రసాద్(చిన్ని), సీనియర్ కోచ్ శివ, డైరెక్టర్ కిశోర్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

టిడిపితో మహిళలకు ప్రత్యేక గుర్తింపు

కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి అనిత

మాట్లాడుతున్న అనిత

ప్రజాశక్తి -నక్కపల్లి:మహిళలకు ప్రత్యేక గుర్తింపునిచ్చింది తెలుగుదేశం పార్టీ అని పాయకరావుపేట నియోజక వర్గం కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వంగలపూడి అనిత అన్నారు. నక్కపల్లిలో క్రిష్ టౌన్ షిప్‌లోని శుక్రవారం ఆమె స్వగృహంలో పాయకరావుపేట నియోజకవర్గం మహిళలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో అనిత మాట్లాడుతూ, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు ,మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రజాస్వామ్యంలో మహిళలకు ప్రత్యేక స్థానం కల్పించారన్నారు.మహిళలు అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చెందాలనే సంకల్పంతో డ్వాక్రా సంఘాలను బలోపేతం చేసి తోడ్పాటును అందించడం జరిగిందన్నారు. జగన్ పాలనలో వ్యవస్థలన్నింటినీ నిర్వీర్యం చేశారన్నారు. నవరత్నాల పేరిట ప్రజలను మోసం చేశారని, నిత్యావసర సరుకులు అడ్డు అదుపు లేకుండా పెరిగాయన్నారు.ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను, ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్ ను గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో సీఎం రమేష్ కోడలు పూజ, పాయకరావుపేట నియోజకవర్గం కూటమి మహిళా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టిడిపిలో పలువురు చేరిక

నక్కపల్లి:పార్టీలో చేరిన వారికి సముచిత స్థానం కల్పిస్తామని ఎమ్మెల్యే అభ్యర్థి అనిత అన్నారు. మండలంలోని అమలాపురంకు చెందిన పలువురు టిడిపిలో చేరారు. వారికి పార్టీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తానని అనిత హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న తహశీల్దార్

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి -కోటవురట్ల: ఈనెల 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి బూత్ లెవెల్ అధికారులు ఎన్నికల విధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని తహసిల్దారు వెంకటరమణ సూచించారు. మండల సమావేశంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాజకీయాలకు అతీతంగా విధులు నిర్వహించాలని, అంకితభావంతో పని చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.సిబ్బందికి రాజకీయ పార్టీల నుంచి ఎటువంటి ఆహార పదార్థాలు, తాగునీరు వంటివి ఏర్పాటు చేయకుండా చూడాలన్నారు. రాజకీయ నాయకులు పోలింగ్ కేంద్రాలకు సమీపంలో ఉండకుండా చూడాలన్నారు. వృద్ధులు, వికలాంగులు ఓటర్లకు ఇబ్బంది కలగకుండా రవాణా సౌకర్యం కూడా కల్పించే విధంగా చూడాలన్నారు. బిఎల్వోలు అడిగిన పలు సమస్యలకు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కాశీ విశ్వనాథరావు, ఆర్ఐ ఊర్ధ్వరావు పాల్గొన్నారు.

మైత్రి గ్రంథాలయానికి కవితా సంకలనం బహూకరణ

ప్రజాశక్తి-గొలుగొండ:ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం (అరసం) ప్రచురించిన ఎన్నికల భారతం కవితా సంకలనం గ్రంథాన్ని స్థానిక అల్లూరి సీతారామరాజు మైత్రి గ్రంథాలయానికి ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం (అరసం) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పడాల వీరభద్రరావు గ్రంథాలయ కమిటీ వారికి బహుకరించారు. శుక్రవారం అల్లూరి సీతారామరాజు స్మారక పార్కును సందర్శించిన ఆయన అనంతరం అల్లూరి సీతారామరాజు మైత్రి గ్రంథాలయాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో జాతీయ అల్లూరి సీతారామరాజు యువజన సంఘం కార్యదర్శులు శ్యామల వరలక్ష్మి, శివంగి నాగేశ్వరరావు, అంబటి వరహాలరాజు పాల్గొన్నారు.

గ్రంథాలు ఇస్తున్న అరసం సభ్యులు

ర్యాలీ, రోడ్డు షో ద్వారా ప్రచారం చేస్తున్న వివి.లక్ష్మీనారాయణ

తాటిచెట్లపాలెంలో 'జైభారత్' ప్రచారం

ప్రజాశక్తి-సీతమ్మధార : ఉత్తర నియోజకవర్గంలోని తాటిచెట్లపాలెం, మర్రిపాలెం తదితర ప్రాంతాల్లో జై భారత్ నేషనల్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి వివి.లక్ష్మీనారాయణ శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అనంతరం తాటిచెట్లపాలెంలోని దర్గాకు చేరుకుని ముస్లిం సోదరులను కలిసి వారి మద్దతు కోరారు. టార్చ్ లైట్ గుర్తుపై ఓటు వేసి తనను గెలిపించాలని విజ్ఞప్తిచేశారు. ముస్లిం మైనార్టీ సోదరులందరికీ అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఉత్తర నియోజకవర్గానికి ప్రత్యేకించి మేనిఫెస్టో తయారుచేశానని, తాను గెలిచిన తర్వాత ఆ మేనిఫెస్టోను అమలు చేసి అన్ని వర్గాల వారికి న్యాయం చేస్తానని చెప్పారు. అందరికీ ఉద్యోగ అవకాశాలు కల్పించి, ఆర్థికంగా బలపడేందుకు ప్రణాళికలు రూపొందించానని తెలిపారు. అనంతరం ఇంటింటి ప్రచారం చేపట్టారు. తమ విలువైన ఓటును అమ్ముకోకుండా నిజాయతీపరులకు వేయాలని కోరారు. తాను సంపాదన మీద ఆశతో కాకుండా మెరుగైన సమాజం నిర్మించాలన్న ఆశయంతో రాజకీయాల్లోకి వచ్చానని తెలిపారు. తనను ఒక్కసారి గెలిపించి చట్టసభకు పంపిస్తే అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపిస్తానన్నారు. అనంతరం నియోజకవర్గంలో బైక్ ర్యాలీ నిర్వహించారు.

పోర్టు కాలుష్య సమస్య పరిష్కారానికి కృషి

సిపిఎం ఎమ్మెల్యే అభ్యర్థి జగ్గునాయుడు

ప్రజాశక్తి -గాజువాక : అదానీ గంగవరం పోర్టు కాలుష్యంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఇండియా కూటమి బలపర్చిన సిపిఎం గాజువాక నియోజవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి ఎం.జగ్గునాయుడు తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం గంగవరం, జాలారిపల్లిపాలెం, పల్లిపాలెం ఏరియాలో సిపిఎం ఎమ్మెల్యే అభ్యర్థి జగ్గునాయుడు, విశాఖ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సత్యారెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి తమకు ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా జగ్గునాయుడు మాట్లాడుతూ, పోర్టు నిర్మాణంతో గంగవరం ప్రజలు ఉపాధి కోల్పోయారని, పోర్టు యాజమాన్యం జెట్టీ నిర్మాణం చేపట్టలేదని, స్థానిక నిర్వాసితుల సమస్యను పరిష్కరించలేదని తెలిపారు. అదాని గంగవరం పోర్టు యాజమాన్యం జీతాలు చెల్లించకుండా కార్మికులను భయభ్రాంతులకు గురిచేస్తుందన్నారు. గంగవరం ప్రజల హక్కుల కోసం సిపిఎం సిపిఐ గంగవరంలో ఎనలేని పోరాటాలు చేశాయని గుర్తు చేశారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ రక్షణకు తమను గెలిపించాలని కోరారు. తమను చట్ట సభలకు పంపిస్తే చెత్త, ఆస్తి పన్ను రద్దు కోసం పోరాడతామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం గాజువాక జోన్ కార్యదర్శి ఎం.రాంబాబు, కె.అప్పలరాజు, కాంగ్రెస్ నాయకులు కె.దేవుడు, కె.కోదండరావు, వై.భూలోక, సిపిఐ నాయకులు పి.పోలయ్య, కె.పోతన్న, సిపిఎం నాయకులు ఎస్.రామారావు, బి.జగన్, కె.అప్పలరాజు, యు సోమేష్, పి.మసేన్, కె.మహేష్, పి.ధనరాజు, ఎం.గురుమూర్తి, కె.నూకరాజు, వై.శ్యాంసుందర్, కె.రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇండియా ఫోరం అభ్యర్థులను గెలిపించాలి

ఈ ఎన్నికల్లో ఇండియా ఫోరం బలపరిచిన గాజువాక నియోజకవర్గ సిపిఎం ఎమ్మెల్యే అభ్యర్థి ఎం జగ్గు నాయుడును, విశాఖ ఎంపీగా పోటీలో ఉన్న కాంగ్రెస్ అభ్యర్థి పి.సత్యారెడ్డిని, గెలిపించాలని భెల్ ఐఎన్‌టియుసి నాయకులు వి.బాబూరావు, భెల్ సిఐటియు ప్రధాన కార్యదర్శి జిటిపి ప్రకాష్ కోరారు. ఇండియా ఫోరం అభ్యర్థులకు మద్దతుగా శుక్రవారం పోస్టర్‌ను విడుదల చేశారు. ఇండియాఫోరంతోనే ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ సాధ్యమన్నారు.



గంగవరం ప్రాంతంలో ప్రచారం చేస్తున్న జగ్గునాయుడు, సత్యారెడ్డి తదితరులు

ఉత్తర నియోజకవర్గంలో ప్రచారం చేస్తున్న రామారావు తదితరులు

'ఉత్తరం'లో కాంగ్రెస్ విస్తృత ప్రచారం

ప్రజాశక్తి-సీతమ్మధార : ఉత్తర నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి లక్కరాజు రామారావు శనివారం విస్తృతంగా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీతోనే రాష్ట్రం బాగుంటుందన్నారు. వైసిపి ప్రభుత్వం రాష్ట్రం సర్వ నాశనమైందన్నారు. నియోజకవర్గంలో పలు సమస్యలతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ముఖ్యంగా తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కొండవాలు ప్రాంతంలో వర్షాలు పడేటప్పుడు కొండ చరియలు విరిగి ఇళ్ల మీద పడుతూ పలువురు మృతిచెందిన ఘటనలు ఉన్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. ఉద్యోగ అవకాశాలు లేక యువత చెడు వ్యసనాలకు బానిసలవుతున్నారని తెలిపారు. తాను ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత వీటికి పరిష్కారం చూపుతానని హామీ ఇచ్చారు. ప్రతి ఒక్కరూ హస్తం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన సతీమణి హంసలేఖ, సిపిఎం, కాంగ్రెస్ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు పటిష్టమైన భద్రత

జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టి

ప్రజాశక్తి-అనకాపల్లి

జిల్లాలో సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా నిష్పక్షపాతంగా జరిగేందుకు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టి తెలిపారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో ఎన్నికల పరిశీలకులు, ఎస్పీ కేవీ మురళీకృష్ణలతో కలిసి పోలీసు అధికారులు, కేంద్ర బలగాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి నియోజకవర్గానికి డీఎస్పీ స్థాయి పోలీసు అధికారుల్ని నియమించినట్లు చెప్పారు. జిల్లాలో ఎక్కడా తీవ్రస్థాయి గొడవలు తలెత్తే అవకాశం లేదని, అయినా పోలీసు అధికారులు భద్రతా దళాలు అత్యంత జాగరూకతతో విధి నిర్వహణ చేయాలని సూచించారు. పోలింగ్ సిబ్బందిని పోలింగ్ కేంద్రాలకు తీసుకు వెళ్లేటప్పుడు వాహనాన్ని మధ్యలో ఎట్టి పరిస్థితుల్లోనూ ఆపరాదన్నారు. 11వ తేదీ సాయంత్రం 6 గంటల నుండి ఎటువంటి సభలు సమావేశాలు ర్యాలీలు జరగకుండా చూడాలని, పోస్టర్లు కటౌట్లు ఏర్పాటు చేయరాదని, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. ఇంటిలిజెంట్ రిపోర్టు ద్వారా ప్రణాళికాయుతంగా చర్యలు చేపట్టాలన్నారు. జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ మాట్లాడుతూ "నో వైలెన్స్-నో రీపోల్" అనే భావంతో ప్రతి ఒక్కరూ పనిచేయాలన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాల పరిస్థితిని పరిశీలించి అంచనాలు రూపొందించామని, సమస్యాత్మక కేంద్రాలకు తగిన బందోబస్తు ఏర్పాట్లు చేశామని చెప్పారు. ఎన్నికల పరిశీలకులు మాట్లాడుతూ ఆఖరు రెండు రోజులలో వివిధ స్థాయిలలో ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించే అవకాశాలు ఉన్నందున సూక్ష్మస్థాయిలో తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో సాధారణ పరిశీలకులు దల్జీత్ సింగ్ మంగత్, రాకేష్ కుమార్, మోహన్ దహికర్, రామస్వామి, ఏఎస్పి బి.విజయభాస్కర్ ఆరు నియోజకవర్గాల డిఎస్పీలు, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు డి రామ్మూర్తి, పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి, చిత్రంలో ఎస్‌పి మురళీకృష్ణ, ఎన్నికల పరిశీలకులు, ఇతర అధికారులు



పంచకర్ల రమేష్‌బాబుకు వినతిపత్రం ఇస్తున్న స్థానికులు

కూటమి అభ్యర్థి పంచకర్ల విస్తృత ప్రచారం

ప్రజాశక్తి-పరవాడ

కూటమి బలపర్చిన జనసేన పార్టీ పెందుర్తి ఎమ్మెల్యే అభ్యర్థి పంచకర్ల రమేష్ బాబు శుక్రవారం పరవాడ సంత బయలు వద్ద శుక్రవారం సాయంత్రం పరవాడ సర్పంచ్ సిరపురపు అప్పలనాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన బహిరంగ సభలో ప్రసంగించారు. మండలంలోని కాలుష్య కోరల్లో చిక్కుకున్న తాడి స్వయంభువరం గ్రామాలను సురక్షిత ప్రాంతానికి తరలిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పైల జగన్నాథరావు, మాసవరపు అప్పలనాయుడు, పైల సన్యాసినాయుడు కన్నూరు వెంకటరమణ, చింతకాయల ముత్యాలు పాల్గొన్నారు.

మండలంలోని ఈదులపాక బోనంగి పంచాయతీ బొద్దపువానిపాలెం గ్రామంలో ఈ.బోనంగి సర్పంచ్ బొద్దపు శ్రీనివాస్ కాసులు ఆధ్వర్యంలో గురువారం పంచకర్ల రమేష్‌బాబును గెలిపించాలని ప్రచారం చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బొద్దపు నూకరత్నం, బొద్దపు ఝాన్సీ ఇతర నాయకులు పాల్గొన్నారు.

సబ్బవరం : తాను ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే తవ్వవానిపాలెం గ్రామాన్ని దత్తత తీసుకొని పక్కా ప్రణాళిక పద్ధతిలో అభివృద్ధి చేస్తానని జనసేన పెందుర్తి ఎమ్మెల్యే అభ్యర్థి పంచకర్ల రమేష్ బాబు అన్నారు. మండలంలోని తవ్వవానిపాలెం గ్రామంలో గురువారం సాయంత్రం యువ నాయకులు బోకం శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో పంచకర్ల రమేష్ బాబు పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బోకం స్వామినాయుడు, మాజీ సర్పంచ్ బోకం అప్పలనాయుడు, మాజీ ఎంపిటిసి బోకం అర్జున్, సీనియర్ నేత గండి నారాయణ బాబు పాల్గొన్నారు.

రాజ్యాంగ హక్కులను పరిరక్షించేవారికే ఓటు వేయాలి

ప్రజాశక్తి- కె.కోటపాడు

రాజ్యాంగం కల్పించిన హక్కులను పరిరక్షించే వారికి ఓటు వేయాలని సిపిఎం మండల కార్యదర్శి రొంగలి ముత్యాల నాయుడు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మండల కేంద్రంలో శుక్రవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ బిజెపి నరేంద్ర మోడీ ఈ ఎన్నికల్లో 400 ఎంపీ సీట్లు గెలిచి భారత రాజ్యాంగాన్ని మార్చుతామని, లౌకికవాదాన్ని, రిజర్వేషన్లను రద్దు చేస్తామని చెబుతున్నారని తెలిపారు. భావ ప్రకటన స్వేచ్ఛగా పూర్తిగా భంగం కలిగించే విధంగా మోడీ ప్రభుత్వం పాలన సాగిస్తుందన్నారు. ఇవన్నీ రాజ్యాంగ స్ఫూర్తిగా పూర్తి విర్ధుమన్నారు. మరో వైపు నరేంద్ర మోడీ ప్రభుత్వం ఎపికి తీవ్ర ద్రోహం చేసిందని, విభజన హామీలను అమలు చేయలేదని తెలిపారు. అయినా బిజెపి ప్రభుత్వ విధానాలను రాష్ట్రంలో వైసిపి ఆఘమేఘాల మీద అమలు చేసిందన్నారు. అందువల్ల బిజెపి, దానికి మద్దతు ఇస్తున్న టిడిపి, జనసేన, తొత్తుగా వ్యవహరిస్తున్న వైసిపి అభ్యర్థులను ఓడించి, మోడీ, చంద్రబాబు, పవన్ కల్యాణ్, జగన్మోహన్‌రెడ్డికి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. వీటికి భిన్నంగా ఇండియా వేదిక పార్టీలు స్పష్టమైన హామీతో ఎన్నికల బరిలోకి దిగాయని, ఇండియా వేదిక తరుపున పోటీ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. సమావేశంలో ప్రజా సంఘాల మండల కన్వీనర్ ఎర్ర దేవుడు, కెవిపిఎస్ నాయకులు గాడి ప్రసాదు, రైతు సంఘం నాయకులు వనుము సూర్యనారాయణ పాల్గొన్నారు.